ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 3 మార్చి 2024

ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

చేవెళ్ల, మార్చి 2 : వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు అన్నారు. శనివారం చేవెళ్ల కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 83 కేసులు పరిష్కరించి.. రూ.2లక్షల 33వేల జరిమానాలు విధించినట్లు చెప్పారు. కార్యక్రమలో ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్సై విఠల్‌రెడ్డి, కవిత, శ్రీశైలం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేవెళ్ల నుంచి కొండా..
మల్కాజ్‌గిరి నుంచి ఈటల

- బీజేపీ తొలి జాబితా విడుదల
- కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌కు ఎంపీ టికెట్ల ఖరారు





ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 2: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. తెలంగాణలో రాజకీయాలు హీటెక్కుతున్నాయి. ఈ క్రమంలోనే భారతీయ జనతాపార్టీ (బీజేపీ) లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో ఆపార్టీ జనరల్ సెక్రటరీ వినోద్ తావడే ఏకంగా 195 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించారు. అందులో తెలంగాణ నుంచి 9 మంది ఉన్నారు. ముందు నుంచి ప్రచారం జరుగుతున్నట్టుగానే ఈటల రాజేందర్‌కు మల్కాజిగిరి పార్లమెంటు బరిలో నిలిచేందుకు పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించింది. మల్కాజిగిరి నుంచి పార్టీ సీనియర్ నేత మురళీధరరావు, మల్క కొమరయ్య ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా పోటీపడ్డారు. చివరకు ఈటల రాజేందర్‌కు టికెట్ దక్కింది. చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అవకాశం దక్కింది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. ఈ పార్లమెంట్ పరిధిలో తాండూరు, వికారాబాద్, పరిగి, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. తొలి ఎన్నికలో దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి ఇక్కడి నుంచి విజయం సాధించారు. ఆయన కేంద్ర మంత్రిగా పనిచేశారు. రెండోసారి ఆయన పోటీకి ఆసక్తి చూపలేదు. 2013లో కేసీఆర్ ఆహ్వానం మేరకు విశ్వేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరి 2014లో పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఆ తర్వాత 2019లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2022లో ఆయన బీజేపీలో చేరారు. ఆ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న 'కొండా'కు ఇపుడు టికెట్ దక్కింది. జాతీయ సాహిత్యపరిషత్ సంఘటన్ కార్యదర్శి భాస్కరయోగి చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశించగా చివరకు 'కొండా'ను వరించింది.



పల్స్ పోలియో ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్, మార్చి2 : నేడు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి కోరారు. పల్స్‌పోలియో పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు శనివారం షాద్‌నగర్ పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎంపిక చేసిన అన్ని బూత్‌లలో పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. అలాగే బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇటుక బట్టీలు, పూరి గుడిసెలో నివసించే చిన్నారులకు కూడా తమ సిబ్బంది మొబైల్ వెహికిల్ ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ తిరుగుతూ పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, పీపీ యూనిట్ ఏఎన్ఎం స్వప్న, గౌస్ ఖాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కాంసాన్‌పల్లి శివారులో జీపీకి కేటాయించిన పది శాతం భూమిలో ప్లాట్లు చేసి పాతిన రాళ్లు

సర్కారు భూమి అని తెలిస్తే చాలు కొందరు అక్రమార్కులు వాటిపై గద్దల్లా వాలిపోతున్నారు. అందిన కాడికి ఆక్రమిస్తున్నారు. వాటిని ప్లాట్లుగా చేసి అధిక ధరలకు అమ్ముకొని కోట్ల రూపాయలు సంపాదించుకుంటున్నారు. వీరు ఇంత తేలికగా ప్రభుత్వ భూముల కాజేయడానికి అధికారులు కూడా తమకు తోచిన సాయం చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతమవుతున్న విషయం కళ్లెదుటే జరుగుతున్నా.. స్థానికులు వాటిపై ఫిర్యాదు చేసినా వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో అక్రమార్కుల ఆట నాలుగు సర్కారు స్థలాలు.. ఆరు వెంచర్లుగా సాగుతోంది.

ప్రభుత్వ భూములు
అన్యాక్రాంతం

- ప్లాట్లు చేసి విక్రయించేందుకు అక్రమార్కుల యత్నం
- చోద్యం చూస్తున్న అధికారులు

పుట్టగొడుగుల్లా వెంచర్లు
పదిశాతం సర్కార్ భూముల ఆక్రమణ

షాద్‌నగర్ రూరల్, మార్చి 2: రాష్ట్ర రాజధానికి, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత చేరువలో ఉన్న షాద్‌నగర్ ప్రాంతంలో ఎకరం భూమి విలువ రూ.కోట్లలో పలుకుతుంది. అంతేగాకుండా ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 576 మీటర్ల ఎత్తులో ఉండటం వల్ల నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండటంతో రియల్ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వెంచర్లు చేస్తున్నారు. మరి కొన్నిచోట్ల అసైన్డ్ భూములను ఆక్రమించుకుంటున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

గంట్లవెల్లి శివారులో 7.20 ఎకరాల అసైన్డ్ భూమి

ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి శివారులోని సర్వే నెంబర్ 2లో 7.20 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఆ భూమిని గతంలో ఓ రైతు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. మొదటి నుంచి రికార్డుల్లో అసైన్డ్ భూమిగా నమోదై ఉండగా.. కొన్నిరోజుల క్రితం అధికారులు అదే రైతు పేరిట పట్టా భూమిగా మార్చారు. దాంతో అక్కడ వేల ఎకరాల్లో రియల్ వెంచర్ చేస్తున్న కొందరు వ్యాపారులు 7.20 ఎకరాల భూమిని కూడా కొనుగోలు చేసి ప్లాట్లు చేశారు. అనంతరం వాటిని విక్రయించారు. కాగా, ఆ భూమి విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో సుమారు రూ.15 కోట్ల వరకు ఉంటుందని అంచనా. అయితే, భూమి అన్యాక్రాంతమైనట్లు కొందరు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఇటీవల భూమి అన్యాక్రాంతమైనట్లు మళ్లీ వెలుగు చూడటంతో స్పందించిన రెవెన్యూ అధికారులు విచారణ చేసి అసైన్డ్ భూమికి అధికారులు అక్రమంగా పట్టా ఇచ్చినట్లు తేల్చారు. దాంతో వారం రోజుల క్రితం 7.20 ఎకరాలు ప్రభుత్వ భూమికి చెందినదిగా బోర్డు కూడా ఏర్పాటు చేశారు.



గంట్లవెల్లి శివారులో 7.20 ఎకరాలకు సంబంధించి అధికారులు ఇటీవల ఏర్పాటు చేసిన బోర్డు

పంచాయతీల పదిశాతం భూములు మాయం!

ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి, కమ్మదనం, మధురాపూర్, సోలీపూర్, చిల్కమర్రి కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, కాంసాన్‌పల్లి తదితర గ్రామాల్లో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వేలాది ఎకరాల్లో వెంచర్లు వేసింది. అయితే, గ్రామ పంచాయతీలకు రియల్ వెంచర్ యజమానులు పది శాతం భూమిని రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. కానీ, వారు అవేమీ పట్టించుకోవడం లేదు. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. గ్రామ పంచాయతీలకు కేటాయించే పదిశాతం భూములపై సమగ్ర విచారణ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కుమ్మక్కై రియల్ వ్యాపారులు ఆ భూమిని కూడా ఆక్రమించుకొని ప్లాట్లుగా మారుస్తున్నారనే ఆరోపణలున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో పదిశాతం భూములను రియల్ వ్యాపారులు ప్లాట్లుగా చేసి విక్రయానికి పెట్టినట్లు జోరుగా చర్చించుకుంటున్నారు.

మిగులు భూములపై విచారణ చేపట్టాలి

సర్వే నెంబర్లు కేటాయించకుండా మిగిలిపోయిన భూములపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు. గతంలో సమగ్ర సర్వే చేసి నెంబర్లు కేటాయించే సమయంలో కొన్ని గ్రామాల సరిహద్దుల్లో భూములకు నెంబర్లు కేటాయించలేదు. రెండు గ్రామాల సరిహద్దులో ఉండటం, సర్వే సమయంలో ఆ భూములు రెండు గ్రామాల పరిధిలోకి వస్తున్నాయని అధికారులు నెంబర్లు కేటాయించలేదు. దాంతో ఆ భూములను రియల్ వ్యాపారులు ఆక్రమించుకొని వెంచర్లు చేస్తున్నారు. ఎలికట్ట, కిషన్‌నగర్ శివారులోనే సుమారు 25 ఎకరాల భూములు ఆక్రమించుకున్నట్లు సమాచారం. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఆ భూముల విలువ సుమారు రూ.50 కోట్ల పైమాటే. మిగులు భూములపై సమగ్ర విచారణ చేయాలని, వాటికి వెంటనే సర్వే నెంబర్లు కేటాయించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి



గంట్లవెల్లి శివారులో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా అధికారులు పట్టించుకోవడం లేదు. రియల్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. గతంలో ఇదే విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. భూ ఆక్రమణదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. రియల్ వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేస్తే జీపీలకు పదిశాతం భూమి ఇవ్వాల్సిందే.

- బాదెపల్లి సిద్ధార్థ, మాజీ సర్పంచ్ గంట్లవెల్లి

సమగ్ర విచారణ చేపట్టాలి



ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం, పదిశాతం భూముల ఆక్రమణపై సమగ్ర విచారణ చేపట్టాలి. ఆ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి. మండలంలో గ్రామాల వారీగా ప్రభుత్వ భూములపై విచారణ చేయాలని అసెంబ్లీ ఎన్నికలకు ముందు జడ్పీ సమావేశంలో తీర్మానించాం. భావితరాల భవిష్యత్తు కొరకు భూములను కాపాడాలి.

- వెంకట్‌రాంరెడ్డి, జడ్పీటీసీ, ఫరూఖ్‌నగర్

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

- జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి
- హస్తం గూటికి చేరిన బీఆర్ఎస్ నాయకులు

మొయినాబాద్ రూరల్, మార్చి 2 : కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగుర వేసేందుకు పార్టీ శ్రేణుల కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని ఆమె నివాసంలో సునీతా మహేందర్‌రెడ్డి, పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్ మొయినాబాద్ మండలాధ్యక్షుడు దేవరంపల్లి మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మనోజ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యలాల జైపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాల్‌రాజ్, పీఏసీఎస్ డైరెక్టర్ ఈగ రవీందర్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. చేవెళ్ల పార్లమెంటు సీటును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాణెయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు కేసరి సంజీవరెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మొయినాబాద్ మండల నాయకులు మాధవరెడ్డి, జంగారెడ్డి, మహేందర్‌రడ్డి, విక్రమ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



సునీత, భీంభరత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

రాజీమార్గమే రాజమార్గం

- జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

ఆమనగల్లు , మార్చి 2: రాజీ మార్గమే రాజమార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. రాజీ ద్వారా కేసులను సత్వరగా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్‌లు దోహద పడతాయన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 16న నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమంపై శనివారం ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ మండలాల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్ గురించి కేసుల్లో ఉన్న కక్షిదారులకు సమాచారం అందించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. కక్షిదారులు కేసుల కోసం కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో కడ్తాల సీఐ శివప్రసాద్, ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి ఎస్ఐలు బాల్‌రామ్ నాయక్, వరప్రసాద్, శ్రీధర్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాటం స్వరూప

పొరపాట్లు లేకుండా
ధరణి దరఖాస్తుల పరిశీలన

- రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ శశాంక సూచన

రంగారెడ్డి అర్బన్, మార్చి 2 : పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా బాధ్యతగా పనిచేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధరణి దరఖాస్తుల పరిశీలన, ప్రభుత్వ భూములు రక్షణపై రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరించాలనే విషయంపై ఆర్డీఓలు, తహసీలార్లు, ధరణి ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. గడువు లోపల పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే ఫీల్డ్ విజిట్ చేసి ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తిస్థాయిలో కలెక్టరేట్‌కు సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వం పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకై మార్చి ఒకటో తేదీ నుండి 9వ తేదీ వరకు పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేకడ్రైవ్ చేపట్టినందున చాలా బాధ్యతతోపాటు వేగవంతంగా ఈ స్పెషల్ డ్రైవ్‌ను పూర్తి చేయాలన్నారు. ప్రతీ మండలంలోని గ్రామాల వారీగా ప్రభుత్వ భూముల వివరాలు ప్రతీ తహసీల్దార్ వద్ద ఉండాలన్నారు. ధరణి దరఖాస్తులను అందుబాటులో ఉన్న రికార్డుల ద్వారా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. మాడ్యూల్ వారీగా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రతీ దరఖాస్తును పరిష్కరించేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని కలెక్టర్ శశాంక తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ధరణి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఎంపీ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది వివరాలివ్వాలి

రానున్న పార్లమెంటు ఎన్నికలలో విధులు నిర్వహించేందుకు వివిధ శాఖల సిబ్బందికి సంబంధించిన పూర్తి వివరాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోలు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో విధులు నిర్వహించేందుకు ఆయా శాఖల ద్వారా అందించే సిబ్బంది వివరాలు పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. సిబ్బందికి సంబంధించిన ఇంటి చిరునామాలు, ఎపిక్ కార్డుల వివరాలు తప్పనిసరిగా అందించాలని, ఇంకా వివరాలు అందించని శాఖల వారు వెంటనే జిల్లా పరిశ్రమల శాఖ అధికారికి అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ఆర్డీవోలు సూరజ్ కుమార్, రవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, డీసీవో ధాత్రిదేవి, ఎల్డీఎం కుసుమ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, డీపీవో సురేష్ మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు..


శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కలెక్టర్ కె.శశాంక పాల్గొని శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభ స్పీకర్‌గా డి.శ్రీపాదరావు అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు
మైసిగండి శివరామాలయం ముస్తాబు

- 7 నుంచి కాశీవిశ్వనాథస్వామి జాతర ప్రారంభం
- మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగింపు
- 8న శివపార్వతుల కల్యాణం, రథోత్సవం
- ప్రతీ రోజు రుద్ర, నవ గ్రహ, గణపతి హోమాలు

కడ్తాల్, మార్చి 2 : రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా వెలుగొందుతున్న మండలంలోని మైసిగండి శివరామాలయం మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ప్రతీ యేటా శివ రాత్రి సందర్భంగా శ్రీ కాశీవిశ్వనాథస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 7 నుంచి 9 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మైసిగండి శివరామాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, నల్గొండ, మెదక్, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. కాగా, శివాలయం ముందు భాగంలో ఉన్న కోనేరు గంగ సమతుల్యతను సంతరించుకుంది. ఇక్కడ స్నానాలు ఆచరిస్తే పాపాలు, రోగాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శిథిలావస్థకు చేరిన కోనేరును సుమారు కోటి రూపాయల వ్యయంతో పునరుద్ధరించారు. ఇక్కడి కోనేరు భక్తులను ఎంతగానో ఆకర్షిస్తుంది.






ఆలయంలో కొలువుదీరిన కాశీ విశ్వనాథస్వామి

ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు

మైసిగండి శివాలయం వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ముందు భాగంలో చలువ పందిర్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని అందంగా అలంకరిస్తున్నారు. మండప దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్ నుంచి మైసిగండికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

ఈనెల 7నుంచి 9వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలి, ఈవో స్నేహలతలు వివరించారు. 7న విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణం, స్వామివారికి మహన్యాసకపూర్వ రుద్రాభిషేకం, 8న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో శివపార్వతుల కల్యాణం, రథోత్సవం, 9న వసంతోత్సవం, అవభృతం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు రుద్రహోమం, నవగ్రహ హోమం, గణపతి హోమం నిర్వహించనున్నట్లు చెప్పారు.సమయానుకూలంగా ధార్మిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని సిరోలిపంతూ, స్నేహలతలు కోరారు.



ఆలయం వద్ద పవిత్ర కోనేరు

నేడు విగ్రహావిష్కరణ యాలాల: అగ్గనూర్‌లో నేడు(ఆదివారం) చత్రపతి శివాజీ విగ్రహావిష్కరించనున్నట్లు అగ్గనూర్ వివేక్ యువజన సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పాల్గొంటారని చెప్పారు.

ఎంఎంటీఎస్ రైలు ప్రారంభ ఏర్పాట్ల పరిశీలన


ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, మార్చి 2: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఎంఎంటీఎస్ రైలు ఘట్‌కేసర్‌కు వచ్చే సమయం అసన్నమైందని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5న ఎంఎంటీస్ రైలును సంగారెడ్డిలో ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అదే సమయంలో లింగంపల్లి నుంచి ఘట్‌కేసర్ వరకు నడిచే ఎంఎంటీఎస్ రైలును సైతం వర్చువల్‌గా ప్రారంభిస్తారని గుర్తు చేశారు. మొదట ఎంఎంటీఎస్ సేవలు చర్లపల్లి వరకే ఉండేదని దానిని ఘట్‌కేసర్ వరకు తీసుకు రావడానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఘట్‌కేసర్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు(ఎంపీ)డాక్టర్ కోవ లక్ష్మణ్ సాయంతో ఢిల్లీలో రైల్వే మంత్రిని కలిసి ఘట్‌కేసర్ వరకు తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఎంఎంటీఎస్ రైలు ఘట్‌కేసర్ వరకు రావడం వల్ల ఇక్కడి ప్రజలకు రవాణ సౌకర్యం మెరుగుపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన కిషన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్, రామతీర్థ, బస్వరాజు, పవన్‌రెడ్డి, శంకర్, శివరాజ్, దీనేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8 నుంచి గ్రూప్ 1 ఉచిత కోచింగ్

వికారాబాద్, మార్చి 2: ఈనెల 8వ తేదీ నుంచి టీఎస్ పీఎస్ గ్రూప్-1 ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు టీఎస్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత కోచింగ్‌ను టీఎస్ బీసీ స్టడీసర్కిల్, రోడ్‌నెంబర్-8 లక్ష్మీ నగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాదలో చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 3 నుంచి 7వ తేదీ వరకు నేరుగా పై చిరునామాలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రులల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. గ్రాడ్యుయేషన్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-24071178, 040-27077929 నంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

'స్పెషల్ డ్రైవ్' సక్రమంగా నిర్వహించాలి

ధారూరు, మార్చి 2: ధరణి సమస్యలపై చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ధారూరు తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈనెల 9వరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు. రెండు బృందాలు ఏర్పాటుచేసి పెండింగ్ దరఖాస్తులన్నింటినీ ప్రక్షాళన చేయాలని తహసీల్దార్ సాజిదాబేగం, డీటీ విజయ్‌లకు సూచించారు.



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

నెలరోజుల పాటు 'పోలీస్ యాక్ట్ 161'

● వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి



వికారాబాద్, మార్చి 2 : జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెలరోజుల పాటు(మార్చి 31) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఏ) పోలీసు యాక్ట్ 161 అమలులో ఉంటుందని ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతిభద్రతలకు భంగం కలిగేలా, ప్రజాధనానికి నష్టం వాటిల్లేలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

గ్రేట్ 'జాబ్'

● ఒకేసారి 4 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన నలుగురు

● ఒకే ఇంట్లో అక్కాతమ్ముడికి..

రెండు కొలువులు సాధించిన మరొకరు..



నాలుగు కొలువులు సాధించిన పావని, మహిపాల్(పైన) సయ్యద్ అర్షా, లలితకుమారి(కింద)

వికారాబాద్/కందుకూరు/దౌల్తాబాద్, మార్చి 2 : ఈ రోజుల్లో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటేనే రోజూ గంటల తరబడి కష్టపడి చదవాలి. అలాంటిది ఏకంగా నాలుగు కొలువులు సాధించడం అంటే.. వారు ఎంతలా శ్రమించారో ఊహించుకోవచ్చు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ పట్టణంలోని రామయ్య గూడకు చెందిన దుద్యాల పావని ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. తల్లి చంద్రమ్మ ఓ మెడికల్ కాలేజీలో స్వీపర్‌గా పనిచేస్తూ కష్టపడి చదివించింది. దానికి ఫలితంగా అహర్నిశలు శ్రమించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది పావని. గురుకుల బోర్డు నిర్వహించిన పరీక్షతో పాటు ఇంటర్వ్యూ, డెమోలో ప్రతిభ చూపింది. దాంతో ఏకంగా నాలుగు ఉద్యోగాలకు అర్హత సాధించింది. డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్‌గా అర్హత సాధించింది. పావనికి కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. నవాబుపేట మండలం పులుమామిడికి చెందిన లక్ష్మీగళ్ల జంగయ్య, అనంతమ్మల మూడో కుమారుడు మహిపాల్ ఇటీవల ప్రకటించిన గురుకుల ఉద్యోగ ఫలితాల్లో నాలుగు ఉద్యోగాలకూ ఎంపికయ్యాడు. పేద కుటుంబంలో జన్మించిన మహిపాల్ పాఠశాల విద్యాభ్యాసాన్ని స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో.. హైదరాబాద్ నిజాం కళాశాలలో గ్రాడ్యుయేషన్, ఉస్మానియా వర్శిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించాడు. పీజీటీ, జేఎల్ ఫలితాల్లో భాగంగా రాష్ట్రంలో 2వ స్థానంలో, మల్టీజోన్-2లో మొదటి స్థానంలో నిలిచాడు. కాగా, మహిపాల్ 2018లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించాడు. తన వెన్నంటి ఉండి మద్దతిచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, చిన్నప్పటి నుంచి మార్గదర్శనం చేసిన గురువులకు, మిత్రులకు మహిపాల్ ధన్యవాదాలు తెలిపాడు. అదే విధంగా రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం నేదునూరు గ్రామానికి చెందిన సయ్యద్ అర్షా. ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. డీఎల్(గణితం), జేఎల్, పీజీటీతో పాటు టీజీటీ కొలువులు సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లోనూ ఆమె అర్హత సాధించింది. టీఎస్‌పీఎస్సీ(జేఎల్) ఫలితాల్లోను రాణించనున్నట్లు అర్షా 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. కాగా, తన భర్త ఎండీ సల్మాన్(ప్రభుత్వ ఉపాధ్యాయుడు) ప్రోత్సాహంతోనే ఇదంతా సాధ్యం అయినట్లు తెలిపారు. డిగ్రీ లెక్చరర్(డీఎల్) ఉద్యోగాన్ని ఎంచుకొని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడతానని అర్షా పేర్కొన్నారు. ఈనెల 4న సీఎం చేతుల మీదుగా ఉద్యోగ నియామకపత్రం అందుకోనున్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన కొండా లలితకుమారి జేఎల్(రసాయన శాస్త్రం), టీజీటీ(భౌతిక శాస్త్రం), టీజీటీ(జీవ శాస్త్రం), టీజీటీ(జనరల్ సైన్స్)లలో ఉద్యోగాలు సాధించింది. ఈ సందర్భంగా లలితకుమారిని గ్రామస్తులు, కుటుంబసభ్యులు అభినందించారు.

ఒకే కుటుంబంలో(అక్కాతమ్ముడు) ఇద్దరికీ..



నేనావత్ పద్మ, రమేశ్

దోమ : మండలంలోని దిర్సంపల్లి తండాకు చెందిన ఒకే కుటుంబంలో అక్కాతమ్ముడు ఇద్దరూ గురుకుల ఫలితాల్లో పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించారు. మొదట నేనావత్ పద్మ పీజీటీ ఉద్యోగం సాధించగా.. తాజాగా వెలువడిన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్(గణితం)గా.. సోదరుడు రమేశ్ టీజీటీ ఉద్యోగం సాధించాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు వారిని అభినందించారు.

ఏకకాలంలో రెండు ఉద్యోగాలకు ఎంపిక



మున్నూరు శివలీల

పెద్దేముల్ : మహిళ గురుకుల పాఠశాలలో లెక్చరర్‌గా పని చేస్తూ ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావాలనే లక్ష్యంతో చదివి ఏకకాలంలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది మండలంలోని బండమీదిపల్లికి చెందిన మున్నూరు శివలీల. ఆమె గురుకుల ఫలితాల్లో జేఎల్‌కు ఎంపికైంది. ఇదిలా ఉండగా మళ్లీ ఫిజికల్ సైన్స్ (టీజీటీ) ఉద్యోగానికి కూడా ఎంపికై తన పట్టును నిరూపించుకోవడంతో పలువురు అభినందిస్తున్నారు.

కళతప్పిన పల్లె ప్రకృతివనాలు



నంద్యానాయక్ తండాలోని పల్లె ప్రకృతివనం ఇలా.. ఎండుముఖం పట్టిన మొక్కలు

బషీరాబాద్, మార్చి 2 : గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతివనాలు బోసిపోతున్నాయి. సరైన నిర్వహణ లేక కళ తప్పుతున్నాయి. మండల పరిధిలోని చాలా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, జీపీ సిబ్బంది పల్లె ప్రకృతివనాలను పట్టించుకోవడం మానేశారు. నాటిన మొక్కలకు నీరు పట్టడం, పిచ్చి మొక్కల తొలగింపు వంటి చర్యలు చేపట్టడం లేదు. సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టినా వాటి నిర్వహణపై దృష్టిసారించడం లేదు. దాంతో పలుచోట్ల మొక్కలు వాడి, ఎండుముఖం పడుతూ కళహీనంగా మారాయి. మండలంలోని నంద్యానాయక్‌తండా పల్లె ప్రకృతివనం ఈ దుస్థితికి అద్దం పడుతోంది.

'ఉపాధి' కూలీలకు వేతనం పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న శ్రీనునాయక్

షాద్‌నగర్, మార్చి 2 : పెరిగిన నిత్యావసర ధరలను పరిగణలోకి తీసుకొని ఉపాధి హామీ కూలీల రోజూవారి వేతనాలను పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ గ్రామంలో కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు రోజూవారి వేతనాన్ని రూ. 800లకు పెంచాలని, లేకుంటే కొలతలైనా తగ్గించాలని డిమాండ్ చేశారు. 5నెలలుగా వర్షాలు లేపోవడంతో కూలీలకు పనులు దొరకడం లేదన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నందున పనిదినాలను 100 నుంచి 200లకు పెంచాలని కోరారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఐక్య ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

జీపీ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి



సూపరింటెండెంట్ వేణుగోపాల్‌కు వినతి పత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

కొత్తూర్, మార్చి 2: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ వేణుగోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా.. జీపీ కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కార్మికులకు బీమాతో పాటు గుర్తింపుకార్డులు, కనీస వేతనాలు అందజేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకుడు మామిడి శేఖర్‌రెడ్డి, నాయకులు మైసయ్య, రాములు, భిక్షపతి, సురేష్, సాయిలు, యాదగిరి తదితరులున్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ

షాబాద్, మార్చి 2 : నిరుద్యోగ యువతకు రోటరీక్లబ్ చందానగర్ వారి ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోపీకృష్ణ, మాజీ అధ్యక్షుడు చేవెళ్ల స్వామి అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు, మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు ఇవ్వడానికి రోటరీక్లబ్ ముందుకొచ్చిందన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్, అకౌంటింగ్, ఎలక్ట్రీషియన్, టైలరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు చందన్‌వెల్లి జీపీ కార్యాలయంలో ఆదివారం పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9866378835 ఫోన్ నెంబరును సంప్రదించాలన్నారు. ప్రధాన కార్యదర్శి రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచి పనులతో సమాజంలో గుర్తింపు



ఎంపీడీవోను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 2 : ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పని చేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన బదిలీపై వెళ్లిన ఎంపీడీవో వై.అరుణారెడ్డి ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి జడ్పీచైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు తప్పవన్నారు. అరుణారెడ్డి చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ఆరేళ్ళ పాటు ఎన్నో మంచి పనులు చేశారని ఎంపీపీ తెలిపారు. కరోనా సమయంలో తనతో పాటు గ్రామాల్లో తిరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. అనంతరం ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మండల అధికారులు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది అరుణారెడ్డిని ఘనంగా సత్కరించారు. వైఎస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీడీవో గీతారెడ్డి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రామారావు, వినోద, రవి, కందుల సరళ, ఎంపీవో నందకిశోర్, మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు ఓరుగంటి వెంకటేష్‌గౌడ్, కొంతం వెంకట్‌రెడ్డి, వంగూరి శివశంకర్, యాదగిరి, ఆయా గ్రామాల కార్యదర్శులు, అధికారులు, మండల, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా రూ.16 నొక్కేస్తున్నారు!

● ఆసరా పింఛన్ల పంపిణీలో చేతివాటం ● 2,016 రూపాయలకు చేతికందేది రూ.రెండు వేలే..

● సరిపడా చిల్లర లేదంటూ పోస్టాఫీస్ సిబ్బంది చిర్రుబుర్రు ● చేసేదేమీలేక గమ్మునుంటున్న లబ్ధిదారులు



పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్‌దారులు

మర్పల్లి, మార్చి 2 : ప్రతీ నెల పింఛన్ల పంపిణీలో పోస్టాఫీస్ సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. సరిపడా చిల్లర లేదంటూ పింఛన్‌దారుల వద్ద రూ.16 నొక్కేస్తున్నారు. ఇదేమిటనీ ప్రశ్నిస్తే.. వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ప్రభుత్వం ప్రతీనెల వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు ఆసరా పింఛన్లు అందిస్తోంది. ఈక్రమంలో ప్రతీ పింఛన్‌దారుకురూ.2,016 అందించాల్సి ఉండగా.. మర్పల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీల్లో పోస్టాఫీస్ సిబ్బంది రూ.2వేలు అందించి పింఛన్ బుక్కుల్లో మాత్రం రూ.2,016 అందించినట్లు నమోదు చేస్తున్నారు. ప్రతీనెల రూ.16 చొప్పున నొక్కేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని పింఛన్ లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ద్వారా రూ.2,016 వస్తే రూ.16 ఎందుకు ఇవ్వడం లేదని కొందరు ప్రశ్నించగా.. చిల్లర ఎక్కడి నుంచి తీసుకురావాలని దబాయించడమే కాకుండా.. పింఛన్ బుక్కులను విసిరి పడేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. మరి కొంత మంది రూ.2వేలే అందిస్తామని లబ్ధిదారుల దగ్గరి నుంచి చిల్లర నొక్కేస్తున్నారు. ఇప్పటికైనా పింఛన్‌ల పంపిణీ సమయంలో ప్రభుత్వం ద్వారా వచ్చే మొత్తాన్ని అందించేలా చూడాలని పింఛన్‌దారులు వేడుకుంటున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి 2 : మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శంగా నిలుపుతానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ కేశవులు ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలను వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయన్‌పల్లి తండా, విఠాయిపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డుల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, వీధిదీపాలు ఏర్పాటు చేస్తామని, మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ అసంపూర్తి పనులు పూర్తిచేయించి వేసవి లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాయకులు గుర్రం కేశవులు, రాగ్యనాయక్, శ్రీధర్, హర్యనాయక్, గోపాల్‌నాయక్, తిరుమలేశ్, గోపి, రవి, మల్లేశ్ నాయక్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో నూతన ఆవిష్కరణలు

● గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ

ఇబ్రహీంపట్నం, మార్చి 2 : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించి నూతన ఆవిష్కరణలు చేయాలని గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యా సంస్థల్లో శనివారం బ్రూమోస్ ఫీస్టా టెక్నో, కల్చరల్ ఫెస్ట్ - 2024ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ సాధనే ధ్యేయంగా కాకుండా పలువురికి ఉద్యోగాలు కల్పిస్తూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అన్నారు. ఈ విషయంలో అధ్యాపకులు కూడా విద్యార్థులకు సహకరించాలని చెప్పారు. గురుశిష్యుల బంధం బలంగా ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఆ సంస్థ ఎండీ హెచ్.ఎస్.సైనీ అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు హుషారుగా పాల్గొన్నారు. అలాగే వివిధ విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.కె.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ డా.పి.పార్థసారథి, అసోసియేట్ డైరెక్టర్ డా.రిషి సాయల్, ఆర్అండ్‌డీ డీన్ డా.ఎస్.వి.రంగనాయకులు, సంజీవ్ శ్రీవాస్తవ, ఈవెంట్ చీఫ్ కోఆర్డినేటర్ డా.హరీష్ కుంద్రా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గగన్‌దీప్ సింగ్ కోహ్లీ

ముగిసిన సింధూర గణపతి శిఖర ప్రతిష్ఠాపన

● జినుగుర్తి ఏకలవ్య గ్రామీణ వికాస్ కేంద్రంలో పూజలు

● పాల్గొన్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి

● భక్తిశ్రద్ధలతో గణపతి విగ్రహ ప్రాణప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రతినిధి భాగయ్య, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన రామానుజ జీయర్‌స్వామి, తదితరులు

తాండూరు రూరల్, మార్చి 2 : తాండూరు మండలం జినుగుర్తి గ్రామ శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహించిన సింధూర గణపతి దేవాలయం పునర్నిర్మాణం, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈనెల 29 నుంచి వేదమంత్రాలతో గణపతిపూజ, పుణ్యహావచనం, పాంచగవ్యపూజ, సంప్రోక్షణ, ఆచార్యాది ప్రధాన కళష ఆరాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, జలాధివాసం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో సింధూర గణపతి ప్రాణప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 11.20 గంటలకు ప్రారంభమైన పూజలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యనిర్వాహక ప్రతినిధి శ్రీభాగయ్య ఆధ్వర్యంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ బార్ల సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తాండూరు మండల బీజేపీ నాయకులు, ఏకలవ్య ఫౌండేషన్ సభ్యులు షేఖాపురం ఆంజనేయులు, సుధారాణి దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఏకలవ్య ఫౌండేషన్ సమష్టి నిర్ణయంతో సింధూర గణపతిగా నామకరణం చేసి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వినోద్‌కుమార్ జైన్, పి.బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగప్ప, సుబ్బారావు, మల్లేశం, జయదేవ్, కృష్ణాముదిరాజ్, బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, ప్రభుశంకర్, రమేష్, వై.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

తాండూరు రూరల్ : తాండూరు మండలం బెల్కటూర్ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం భ్రమరాంబిక-స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రధాన పూజారి రాజయ్య ఆధ్వర్యంలో గాండ్ల సంగప్ప, శివలీల, మఠం సుధీర్, శాంతకుమారి, భ్రమరాంబిక అమ్మవారి తరఫున అల్లిపురం వెంకటేశం, సౌభాగ్యవతి, సంతోష్‌కుమార్, అన్నపూర్ణ దంపతులు కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం శివస్వాములు భక్తులకు అన్నదానం చేశారు. శివస్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బెల్కటూర్‌లో మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు

శ్రీపాదరావు సేవలు ప్రశంసనీయం


శ్రీపాదరావు జయంతి వేడుకల్లో వీర్లపల్లి శంకర్, స్పీకర్, కోమటిరెడ్డి, తదితరులు

షాద్‌నగర్, మార్చి 2 : మాజీ స్పీకర్ శ్రీపాదరావు సేవలు ప్రశంసనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. శ్రీపాదరావు 87వ జయంతిని పురస్కరించుకుని శనివారం శాసనసభలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా పని చేయడంతో పాటు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం శ్రీపాదరావు ఎంతో కృషి చేశారని చెప్పారు. చరిత్రలో చిరస్థాయిగా ఆయన నిలుస్తారని అన్నారు.

మహేశ్వరం ఎస్సై సస్పెన్షన్

మహేశ్వరం, మార్చి 2 : మహేశ్వరం పోలీసుస్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సుబ్బారెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. పలు అవినీతి ఆరోపనలు రావడంతో ఆయనపై పోలీసు ఉన్నతాధికారులు ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. ఆ ఆరోపనలు నిజమని తేలడంతో అధికారుల నివేధికల ఆధారంగా రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి ఎస్సై సుబ్బారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐగా చంద్రశేఖర్


చంద్రశేఖర్

షాద్‌నగర్‌రూరల్, మార్చి 2 : షాద్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్ బదిలీపై వచ్చారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను షాద్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఉన్నా ఇంత కాలం సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారే కొనసాగారు.

రూరల్ సీఐగా సత్యనారాయణ...

షాద్‌నగర్ రూరల్ సీఐగా సత్యనారాయణ బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పని చేసిన వెంకటరెడ్డి అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా శంషాబాద్ ఎస్ఓటీలో పని చేసిన సత్యనారాయణ ఇక్కడకు వచ్చారు.

చేవెళ్ల డివిజన్‌లో సీఐల బదిలీలు

చేవెళ్ల, మార్చి 2 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ పోలీస్‌స్టేషన్‌ల్లో పని చేస్తున్న సీఐలను బదిలీ కొనసాగుతోంది. ఇందులో భాగంగా చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు నగరంలోని గోల్కొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. చందనగర్ పోలీస్‌స్టేషన్‌లో డీఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్. వెంకటేశం చేవెళ్ల ట్రాఫిక్ సీఐగా రానున్నారు. షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ నగరంలోని జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నార్సింగ్ ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్న బి. కాంతారెడ్డి ఇక్కడికి రానున్నారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

శంకర్‌పల్లి సీఐగా హబీబుల్లాఖాన్

శంకర్‌పల్లి, మార్చి 2 : శంకర్‌పల్లి నూతన సీఐ గా మహమ్మద్ హబీబుల్లాఖాన్‌ను నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాశ్‌మహంతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హబీబుల్లాఖాన్ గతంలో బహదూర్‌పుర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు. శంకర్‌పల్లిలో పనిచేసిన వినాయకరెడ్డిని సీసీఎస్ బాలనగర్ జోన్‌కు బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆమనగల్లు సీఐగా ప్రమోద్ కుమార్


ప్రమోద్ కుమార్

ఆమనగల్లు, మార్చి 2 : ఆమనగల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోద్‌కుమార్ నియమితులయ్యారు. శనివారం సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన విజయ్‌కుమార్‌ను ఐజీ కార్యాలయానికి సరెండర్ చేయగా, ఆయన స్థానంలో అల్వాల్ సీఐగా పనిచేస్తున్న ప్రమోద్ కుమార్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

తాగునీటి ఎద్దడి రావద్దని వేడుకోలు

మహేశ్వరం, మార్చి 2 : నియోజకవర్గంలో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, ప్రజలు సుఖసంతోశాలతో జీవించాలని మల్లికార్జునస్వామిని వేడుకున్నానని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం తుక్కుగూడలో నిర్వహించిన శివస్వాముల మహాపడిపూజలో ఆయన పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మార్వో

కేశంపేట, మార్చి 2 : మండలంలోని కొత్తపేట జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శనివారం కేశంపేట తహసీల్దార్ అజాంఅలీ పరిశీలించారు. విద్యార్థులు సజావుగా పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాలలో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు నీటివసతి, అవసరమైన వారికి మందులు అందిస్తున్నాట్లు ఆయన వివరించారు.

ఘనంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడి జన్మదిన వేడుకలు


కసిరెడ్డితో కలిసి కేక్‌కట్ చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి, మార్చి 2 : కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం సంగాయిపల్లి సమీపంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. పలు చోట్ల మొక్కలు నాటి, వృద్ధులకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహా, బీచ్యనాయక్, జగన్, మోతిలాల్, శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆహారపదార్థాల నాణ్యత పాటించాలి

మహేశ్వరం, మార్చి 2 : ఆహార పదార్థాల విషయంలో హోటల్ యాజమాన్యాలు నాణ్యత ప్రమాణాలు పాటించాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. శనివారం తుక్కుగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన మధురం రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, నాయకులు పాల్గొన్నారు

భూ సమస్యల దరఖాస్తుల పరిశీలన


మొయినాబాద్: దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎమ్మార్వో

మొయినాబాద్, మార్చి 2 : భూ సమస్యలకు సంబంధించిన ధరణి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించడం జరుగుతోందని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి గ్రామాలకు సంబంధించిన ధరణి దరఖాస్తులను శనివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించడం జరిగుతుందని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోందని చెప్పారు. మండలంలో వివిధ రకాల భూసమస్యలకు సంబంధించిన ధరణి దరఖాస్తులు 2,246 ఉన్నాయని, రైతుల సమక్షంలో వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కేతిరెడ్డిపల్లిలో 45 దరఖాస్తులను పరిశీంచారు. అదే విదంగా చిన్నమంగళారం గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్ ఆధ్వర్యంలో 36 దరఖాస్తులు పరిశీలించారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమౌళి, అక్షయ్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కేశంపేట : బొదునంపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ అజాంఅలీ

సమస్యల పరిష్కారానికే ప్రత్యేక డ్రైవ్

కేశంపేట : ధరణి సమస్యల పరిష్కరానికే ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నదని, భూసమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కేశంపేట తహసీల్దార్ అజాంఅలీ సూచించారు. ధరణి సమస్యల పరిష్కారాం కోసం మండలంలో రెండు టీంలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. శనివారం మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి, తూర్పు చౌలపల్లి, బొదునంపల్లి, లేమామిడి గ్రామాల్లో ధరణి దరఖాస్తులను పరిశీలించారు. బొదునంపల్లిలో తహసీల్దార్ దరఖాస్తులను పరిశీలించారు. వీలైనంత త్వరగా దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు చెప్పారు. దరఖాస్తుల పరిశీలనలో ఆర్ఐ నివేదిత, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకా శిబిరాలు


కొత్తూర్ : పశువులకు టీకాలు వేస్తున్న స్ఫూర్తి

కొత్తూర్, మార్చి 2 : గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల శిబిరాలను నిర్వహిస్తున్నామని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తి అన్నారు. మండల పరిధిలోని పెంజర్ల, కుమ్మరిగూడ, ఇన్ముల్‌నర్వ గ్రామాల్లో నిర్వహించిన టీకాల శిబిరాల్లో ఆమె పాల్గొని 345పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా స్ఫూర్తి మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తామని, రైతులు తమ పశువులను టీకాల కేంద్రాలకు తరలించి, టీకాలను వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లయ్య, కృష్ణ, రవి, పద్మ, రాజు, రైతులు పాల్గొన్నారు.

కడ్తాలలో 4నుంచి..

ఆమనగల్లు : కడ్తాల మండలంలో సోమవారం (మార్చి4) నుంచి పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో గేదెలు, ఆవులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని డాక్టర్ రుద్రాక్ష విజయ్‌కుమార్ తెలిపారు. పశు వైద్య సిబ్బంది రెండు టీంలుగా ఏర్పడి.. 4న ఆమనగల్లు, 5న మంగళపల్లి , 6న చింతలపల్లి, 7న విఠాయిపల్లి, 9న కోనాపూర్, 11న రాంనుంతల, 12న, ముర్తూజపల్లి, 13న జంగారెడ్డిపల్లి, 14న చెన్నంనపల్లి, 15న సింగంపల్లి,16న పోలెపల్లి, 18న ఆకుతోటపల్లి, 19న శెట్టిపల్లి, 20న సీతారాంనగర్ తండా, 21న మేడిగడ్డ తండా, 22న శంకర్‌కొండ తండా, 23న కొత్తకుంట తండాల్లో టీకాలు వేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. మండలంలోని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నందివనపర్తిలో ఉచిత పశు వైద్య శిబిరం

యాచారం, మార్చి 2 : మండలంలోని నందివనపర్తి గ్రామంలో శనివారం పుట్టపర్తికి చెందిన శ్రీ సత్యసాయి సేవా సమితి పశువైద్యులతో పాటు యాచారం మండల పశువైద్యులు ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గొర్రెలకు వివిధ వ్యాధుల నివారణకు మందులేశారు. 145 గొర్రె పిల్లలకు నట్టల నివారణ ముందులు తాగించారు. గర్భకోశ వ్యాధులతో బాదపడుతున్న పశువులకు చికిత్స చేశారు. పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితికి చెందిన పశువైద్య నిపుణులు డాక్టర్ పున్నయ్య, యాచారం మండల పశువైద్యాధికారి రేణుక, మండల రైతు సమన్వయ సమితి మాజీ చైర్మన్ కె.జోగిరెడ్డి తదితరులున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


నియామక పత్రాన్ని అందజేస్తున్న భీంభరత్

షాబాద్, మార్చి 2 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శనివారం చిన్నసోలిపేట్ గ్రామానికి చెందిన నరేందర్‌ను షాబాద్ మండల యూత్ ఉపాధ్యక్షుడిగా ఆయన నియమించి, నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, నాయకులు చింపుల సత్యనారాయణ రెడ్డి, పెంటారెడ్డి, రాహుల్‌గుప్తా, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

● పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే యాదయ్య


షాద్‌నగర్ : పల్లకి సేవలో భక్తులు

శంకర్‌పల్లి, మార్చి 2 : మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం ఘనంగా నిర్వగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వేద పండితులు వారికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని, దానితో మనసు ప్రశాతంగా ఉంటుందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భగవంతున్ని కోరుకున్నట్లు చెప్పారు. చేవెళ్ల వైఎస్ఎంపీపీ శివప్రసాద్, సీనియర్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, ప్రజా ప్రతినిధులు, నిర్వాహకులు, అర్చకులు, భక్తులు ఉన్నారు.


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న హరీష్‌రావు, ఎమ్మెల్యే యాదయ్య, తదితరులు

ఘనంగా పల్లకి సేవ

షాద్‌నగర్ : పట్టణ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో పల్లకి సేవా కార్యక్రమం ఘనంగా జరిగింది. శనివారం ఉదయాన్నే భక్తులు స్వామి వారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్‌చాలీసా పారాయణం అంతనం భజన బృందం సభ్యులు పల్లికిలో హనుమాన్ విగ్రహాన్ని ఉంచి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులిమామిడి శ్రీశైలం గౌడ్, వసంతరావు, రఘుగౌడ్, రమేష్ ముదిరాజ్, రఘునందర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

'లయన్స్' సేవలు అమోఘం


కళ్లజోళ్లు అందజేస్తున్న గోపాల్‌రెడ్డి, చెన్న కిషన్‌రెడ్డి

కందుకూరు, మార్చి 2 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అమోఘమని, ఆ సేవలను మరింతగా విస్తరింపజేయాలని తిమ్మాపురం మాజీ సర్పంచ్ గంగాపురం గోపాల్‌రెడ్డి కోరారు. గ్రామంలో కంటి సమస్య ఉన్న పది మందికి శనివారం లయన్స్‌క్లబ్ మాజీగవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డితో కలిసి కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సన్నీళ్ల శ్రీరాములు, నాయకులు పున్న జ్ఞానేశ్వర్, మంద యాదగిరి, నర్సింహా, పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న బుద్దుల జంగయ్య

కొందుర్గు, మార్చి 2 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని భైరంపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. వేసవి కాలం దృష్ట్యా కూలీలు పనులు చేస్తున్న స్థలంలో తాగునీటి సౌకర్యం, టెంట్ సౌకర్యం కల్పించాలని, ముందుజాగ్రత్తగా ప్రథమ చికిత్స మందులను అందుబాటులో ఉంచాలని, వడదెబ్బ తగిలితే వెంటనే వారిని ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, కూలీ రూ.600 ఇవ్వాలని కోరారు. చిన్న చంద్రయ్య, నర్సింలు, భూపాల్, యాదమ్మ ఉన్నారు.

కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే


మాట్లాడుతున్న కృష్ణవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్, మార్చి 2 : కేంద్రంలో మరోసారి నరేంద్రమోడి ప్రభుత్వమే ఏర్పాటు కానున్నదని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ లాబార్థి సంపర్క అభియాన్ కన్వీనర్ కృష్ణవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు డొడల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏబీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 'లాబార్థి' సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ, భద్రత, ప్రజల అభివృద్ధి సంక్షేమమే మోదీ ధ్యేమని చెప్పారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రతి గ్రామంలోని బూత్ కమిటీ అధ్యక్షులు ప్రజలకు తెలియపర్చాల్సిన అవసరం ఉందన్నారు. రేషన్‌బియ్యం, గరీబ్ కల్యాణ్ యోజన లాంటి పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ పాలనలో దేశం గర్వించేదగ్గ స్థాయికి చేరిందని చెప్పారు. పార్టీ నాయకులు శివకృష్ణ, రఘుగౌడ్, శంకర్‌నాయక్, దార నరసింహులు, శివశంకర్, విఠ్యాల నరసింహా, విష్ణు, లింగంనాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య


వార్షికోత్సవంలో మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, తదితరులు

చేవెళ్ల, మార్చి 2 : విద్యార్థులకు విలువలతో కూడిన, నైణ్యమైన విద్యను అందించాలని చేవెళ్ల మాజీ ఎంపీ. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామ శివారులోని వివేకానంద ఇంటర్ నేషనల్ స్కూల్ మొదటి వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదలతో కూడిన సాంకేతిక విద్యను నేర్పించాలని సూచించారు. చదువుతోనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. విద్యార్థులు భాగా చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల చైర్మన్ కొరడాల నరేష్, హరీష్, విష్ణువర్ధన్, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి

షాబాద్, మార్చి 2 : ప్రజలు ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని పోత్‌గల్ పంచాయితీ కార్యదర్శి అశోక్ కోరారు. శనివారం ఆ గ్రామంలో ఇంటి పన్నులు వసూలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు ,తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకం


విద్యార్థికి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు

చేవెళ్ల, మార్చి 2 : ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకమని ఊరెళ్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ ఇలియాస్ అన్నారు. శనివారం ఆ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటం నుంచి ఫలితాల ప్రకటన వరకు ఉండే దశలను విద్యార్థులు చక్కగా నిర్వహించారు. విద్యార్థులే ఎన్నికల అధికారులు, పోలీస్‌లుగా వ్యవహరించారు. నలుగురు విద్యార్థులు పోటీపడగా 9వ తరగతి విద్యార్థి చరణ్ తేజ్ 67ఓట్ల తో విజయం సాధించాడు. గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాన్ని ప్రధానోపాధ్యాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎన్నికలపై అవగాహన పొందాన్నారు. ఉపాధ్యాయులు రాజు, ప్రకాశ్‌రెడ్డి, అక్బర్, కృష్ణ, సుహాసిని, చాముండేశ్వరి, శ్రీశైలం ఉన్నారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

● పరారీలో మరో ముగ్గురు

కందుకూరు, మార్చి 2 : ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో ఒకరిని అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు కందుకూరు సీఐ మక్బుల్‌జానీ తెలిపారు. శనివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఏడెల్ల భాస్కర్‌రెడ్డి కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన మల్లేష్‌యాదవ్ ఫామ్‌ల్యాండ్ నందు పనిచేస్తున్నాడు. పహడీషరీఫ్‌కు చెందిన వికెష్ యాదవ్ అలియాస్ విక్కి(35) కొత్తూరు గ్రామంలోని పలువురు రైతుల వద్ద పాలు తీసుకెల్లి వ్యాపారం చేస్తున్నాడు. కాగా తాను సహజీవనం చేస్తున్న మహిళను వికెష్‌యాదవ్ వేధిస్తున్నట్లు భాస్కర్‌రెడ్డి తెలుసుకొని అతన్ని ఇటీవల మందలించాడు. దీంతో వికెష్‌యాదవ్ భాస్కర్‌రెడ్డిపై కక్షపెంచుకొని పహడిషరీఫ్‌కు చెందిన తన స్నేహితుడు జగదీష్‌కు విషయాన్ని చెప్పాడు. భాస్కర్‌రెడ్డిపై దాడిచేయడానికి మరో ఇద్దరు వ్యక్తులను సపారి కుదుర్చుకున్నాడు. కాగా గురువారం రాత్రి ఒంటి గంట సమయంలో భాస్కర్‌రెడ్డి నివాసం ఉండే ఫామ్ ల్యాండ్‌కు సపారి కుదుర్చుకున్న జగదీష్‌తో పాటు ఇద్దరు వ్యక్తులు వెళ్లి ఇంటి తలుపును పగులగొట్టి అతనిపై దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రగాయాలైన భాస్కర్‌రెడ్డి వారి నుంచి తప్పించుకొని 100 నెంబరుకు కాల్ చేశాడు. పోలీసులు అతనిని కాపాడి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు సీఐ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం వికెష్‌యాదవ్ అలియాస్ విక్కిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కాగా జగదీష్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్లు రికవరీ


సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం, మార్చి 2 : ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 18 సెల్ ఫోన్లను ఏసీపీ కేవీపీ రాజు, సీఐ సత్యనారాయణ శనివారం బాధితులకు అందజేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల ఐఎంఈఐ నెంబర్లను పరిశీలించి, సీఈఐఆర్ అప్లికేషన్‌లో ఎంట్రీచేసి దర్యాప్తు చేసి నిందితుల నుంచి రికవరీ చేసి సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.4.5లక్షలు ఉంటుందని ఆయన చెప్పారు. సెల్‌ఫోన్లు రికవరీ చేసిన ఇబ్రహీంపట్నం క్రైమ్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్లు నరేష్, కోటేశ్వర్‌రావు, బాబూరావు, శ్రీలతను ఏసీపీ, సీఐ, ఎస్సై మైబెల్లి అభినందించారు.

ప్లాట్ల ఫెన్సింగ్ తొలగించిన వారిపై కేసు

యాచారం, మార్చి 2 : మండలంలోని సెంచరీ గార్డెన్‌లో ఉన్న ప్లాట్ల ఫెన్సింగ్‌ను తొలగించిన ముగ్గురిపై కేసులు నమోదు చేశామని సిఐ శంకర్‌కుమార్ చెప్పారు. నగరానికి చెందిన జయస్వామి ఈ గార్డెన్‌లో ప్లాట్లు కొని వాటి చుట్టూ ఫెన్సింగ్ వేశారని అన్నారు. ఆ ప్లాట్లపై కన్నేసిన ఆవుల మహేందర్, జాహ్నవిరెడ్డి, దత్తాత్రేయరెడ్డి ఫెన్సింగ్ తొలగించినందుకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటిగుంతలో పడి బాలిక మృతి

చేవెళ్ల, మార్చి 2 : వ్యవసాయ పొలంలో ఉన్న నీటిగుంతలో పడి మతిస్థిమితం లేని బాలిక(10) మృతి చెందిన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇక్కరెడ్డిగూడ గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన మత్తయ్య, సారమ్మ పది సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడకు వచ్చి ఆ గ్రామంలో నివాసం ఉంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ముగ్గురు పిల్లలు, వారిలో చిన్న అమ్మాయి బేబీకి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో పాఠశాలకు పంపిండచం లేదు. దీంతో తల్లి ఎక్కడికి పనికి వెళితే అక్కడికి ఆమెతో పాటు పాపను తీసుకువెళ్లేది. శనివారం కూడా తన వెంట బేబీని తీసుకొని సారమ్మ కూలీకి వెళ్లింది. సాయంత్రం 5 గంటల సమయంలో కూతురు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా దొరకకపోవడంతో నీటిగుంతలో చూడగా అందులో పడిఉన్న బేబీ అప్పటికే మృతి చెందింది. ఈ మేరకు సమాచారం అందించడంతో పోలీస్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమాతం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు చెప్పారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

నందిగామ, మార్చి 2 : నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌గూడ శివారులో పాత జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన బీకారాం చౌదరి(41) వరంగల్‌లో నివాసముంటాడు. తన ద్విచక్రవాహనంపై షాద్‌నగర్‌లో ఉన్న తన అన్న శంకర్‌లాల్ దగ్గరకు వెళ్తుండగా చంద్రాయన్‌గూడ వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో బీకారాం చౌదరి తలకు తీవ్ర గాయాలయ్యి అక్కడికక్కడే మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న శంకర్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

ఉరేసుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


మృతుడు

ఆదిభట్ల, మార్చి 2 : ఉరివేసుకొని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నాదర్‌గుల్‌లోని గ్రీన్‌హోమ్స్ కాలనీలోని ప్లాట్ నెంబర్ 301లో నివాసముంటున్న గున్నాల పూర్ణచందర్(36) ఆ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. సమాచారమందున్న ఆదిభట్ల పోలీసులు పంచనామ చేసి మృతదేహాన్ని శవపరీక్షల కోసం ఇబ్రహీంపట్నం సివిల్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. అతని ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తెలియనున్నాయని చెప్పారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

తలకొండపల్లి, మార్చి 2 : మండల పరిధిలోని చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు చక్కటి వేషదారణతో తోటి విద్యార్థులకు బోధించిన తీరు చూపరులకు ముచ్చట గొలిపింది. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. సాయంత్రం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాములు అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో భోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఉపాధ్యాయులు ప్రసన్న లక్ష్మీ, శ్రీదేవి, వెంకట్, సురేశ్, మల్ల్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు డిజిటల్ మైక్ సెట్‌ను ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అఫ్సర్ షహనాజ్ సుల్తాన బహుకరించారు.